


టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేల ప్రకారం అమ్మకాలు జరిగాయి.



కిలో టమాట రూ.7.50

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.7.50, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5 ప్రకారం అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.4°/22.1°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలతో ఎండ తీవ్రత పెరిగింది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత అధికమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

రసాయనిక రంగులు వాడొద్దు



కూల్‌డ్రింక్ షాపును తనిఖీ చేస్తున్న డివిజన్ ఫుడ్ ఆఫీసర్ తస్లీం

హిందూపురం: వేసవిలో అత్యధికంగా ప్రజలు తీసుకునే చల్లటి పానీయాలు, ఐస్‌క్రీముల్లో రసాయనిక రంగులు, రసాయనిక పండ్లు వినియోగించకూడదని డివిజన్ ఫుడ్ ఆఫీసర్ తస్లీం తెలిపారు. గురువారం హిందూపురం, పరిగి ప్రాంతాల్లోని పలు ఐస్‌బర్గ్ తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. హిందూపురంలో నాలుగు షాపుల నిర్వాహకులు ఫుడ్ లైసెన్స్ లేకుండా తయారీ, విక్రయాలు చేస్తున్నారని గుర్తించి నోటీసులు జారీ చేశారు. రసాయన రంగులు, అశుభ్రమైన పదార్థాలు వినియోగిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే లైసెన్సులు రద్దుచేయడంతో పాటు షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు అమలు చేయాలి



కొత్తచెరువులోని ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణలో తప్పనిసరిగా నిబంధనలు అమలు చేస్తూ పొరపాట్లకు అస్కారం లేకుండా చూడాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 125 పరీక్షా కేంద్రాలలో హిందీ పరీక్ష నిర్వహించారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ విద్య కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బసంత్ కుమార్ తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన పరీక్షకు 22,521 మందికి 22,332 మంది విద్యార్థులు హాజరయ్యారు. 189 మంది గైర్హాజరయ్యారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ నేటితో ముగియనుంది. గురువారం నాటికి జిల్లాలోని పింఛన్ లబ్ధిదారులకు 2,58,842 మందికి రూ.71,85,60,000 నగదు అందజేశారు. గురువారం నాటికి సుమారు 98 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు.

ఆదాయం భేష్ !

- ఏడాది వ్యవధిలో 74 వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్
- వార్షిక లక్ష్యంలో 91.58 శాతం వసూలు
- జిల్లా వ్యాప్తంగా రూ.159 కోట్ల రాబడి



జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, పుట్టపర్తి: నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా భూముల రిజిస్ట్రేషన్లలో దూసుకెళ్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల సంఖ్యతో పాటు ప్రభుత్వానికి రాబడి కూడా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా వార్షిక లక్ష్యంలో 91.58 శాతం మేర వసూలైంది. పెనుకొండ, బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లక్ష్యానికి మించి రాబడి వచ్చింది.

జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

జిల్లా వ్యాప్తంగా 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు (బుక్కపట్నం, చిలమత్తూరు, సీకే పల్లి, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, తనకల్లు) ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 నాటికి మొత్తం 74,092 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా రూ.159.03 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఏడాది లక్ష్యం రూ.173.65 కోట్లు కాగా రూ.159.03 కోట్లు (91.58 శాతం) వసూలైంది.

కదిరిలోనే ఎక్కువ డాక్యుమెంట్లు

కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్ వరకు 16,522 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ జరిగింది. హిందూపురంలో 13,869, ధర్మవరంలో 13,3841, బుక్కపట్నంలో 6,782, చిలమత్తూరులో 6,557, పెనుకొండలో 6,302, మడకశిరలో 5,466, తనకల్లులో 2,703, సీకే పల్లిలో 2,580 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 74,062 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి.

పెనుకొండలో 121 శాతం

పెనుకొండ, బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వార్షిక టార్గెట్‌కు మించి ఆదాయం రావడం విశేషం. పెనుకొండలో 121.98 శాతం, బుక్కపట్నంలో 112.53 శాతం మేర వసూలైంది. కదిరిలో 96.92 శాతం, ధర్మవరంలో 96.63, సీకే పల్లిలో 84.97, చిలమత్తూరులో 84.79, హిందూపురంలో 79.16, తనకల్లులో 62.61, మడకశిరలో 60.87 శాతం మేర లక్ష్యం పూర్తయింది.

ఎక్కువ రాబడి ధర్మవరంలోనే..

జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వార్షిక లక్ష్యం రూ.173.65 కోట్లు ఉండగా.. ఏడాది వ్యవధిలో రూ.159.03 కోట్లు రాబడి వచ్చింది. అందులో ధర్మవరం నుంచే అత్యధికంగా రూ.36.84 కోట్లు వచ్చింది. హిందూపురం నుంచి రూ.35.38 కోట్లు, కదిరి నుంచి రూ.25.37 కోట్లు, బుక్కపట్నం నుంచి రూ.18.70 కోట్లు, పెనుకొండ నుంచి రూ.16.05 కోట్లు, చిలమత్తూరు నుంచి రూ.14.25 కోట్లు, మడకశిర నుంచి రూ.5.39 కోట్లు, సీకే పల్లి నుంచి రూ.4.82 కోట్లు, తనకల్లు నుంచి రూ.2.18 కోట్ల ఆదాయం సమకూరింది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఆదాయం (2022 - 23 ఆర్థిక సంవత్సరం)

కార్యాలయం	వార్షిక లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు (రూ.కోట్లలో)	వసూళ్ల శాతం
బుక్కపట్నం	16.62	18.70	112.53
చిలమత్తూరు	16.81	14.25	84.79
చెన్నేకొత్తపల్లి	05.68	04.82	84.97
ధర్మవరం	38.13	36.84	96.63
హిందూపురం	44.70	35.38	79.16
కదిరి	26.18	25.37	96.92
మడకశిర	08.86	05.39	60.87
పెనుకొండ	13.16	16.05	121.98
తనకల్లు	03.49	02.18	62.61
మొత్తం	173.65	159.03	91.58

ఆశాజనకంగా ఆదాయం

గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం ఆశాజనకంగా ఉంది. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వార్షిక లక్ష్యానికి మించి ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అన్ని కార్యాలయాల్లో వంద శాతం వసూలుకు ప్రయత్నిస్తాం. దళారులతో సంబంధం లేకుండా నేరుగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాం. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు.

– కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

జిల్లా నూతన కలెక్టర్‌గా అరుణ్‌బాబు

- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా బసంత్ కుమార్ బదిలీ



జిల్లా నూతన కలెక్టర్ పి. అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా నూతన కలెక్టర్‌గా పి. అరుణ్‌బాబు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 57 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ పి.బసంత్ కుమార్‌ను ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి. అరుణ్‌బాబును శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లా తొట్టతొలి కలెక్టర్‌గా పి.బసంత్‌కుమార్ 2022 ఏప్రిల్ 04న బాధ్యతలు చేపట్టారు. సంవత్సరం పాటు ఆయన కలెక్టర్‌గా నూతన జిల్లా ప్రగతికి కృషి చేశారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?

- విద్యార్థిని మృతిపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం
- 9 మందిపై ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు సిఫారసు



టేకులోడు ఎంజేపీలో విచారణ చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

చిలమత్తూరు: చిలమత్తూరు మండలంలో విద్యార్థిని మహిత మృతిపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఇంతనిర్లక్ష్యమా అంటూ మండిపడ్డారు. 9 మందిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు సిఫారసు చేశారు.

ఇప్పటికే ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

మండల పరిధిలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని మహిత మార్చి 29న అనారోగ్యంతో మృతి చెందింది. ఈ ఘటనపై ఇప్పటికే ఓ టీచర్‌తో పాటు స్టాఫ్‌నర్సుపై సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు టేకులోడు గురుకుల పాఠశాలలో విచారణ చేపట్టారు. విద్యార్థిని తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో కలిపి విచారించారు. మహిత అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకోకపోవడంతోనే మృతి చెందినట్లు కుంభా రవిబాబు తెలిపారు. విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతుంటే కనీసం ఆస్పత్రిలో చేర్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై లేదా అని ప్రశ్నించారు. స్కూల్ సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలపడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించి ఉంటే ఆ అమ్మాయి బతికి ఉండేది కదా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న మహితను పీఈటీ గ్రౌండ్‌లో ఐదు సార్లు పరిగెత్తించడంతో మరింత అనారోగ్యానికి గురైందన్నారు. ఇలాంటి అమానవీయ సంఘటన తనను కలచివేసిందన్నారు. అందుకే తానే స్వయంగా విచారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందగా, అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో ఎందుకు పోస్టుమార్టం నిర్వహించలేదో సమాధానం చెప్పాలన్నారు. పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించగా, తల్లిదండ్రులే కేసు వద్దని రాసిచ్చారని, అందుకే కేసు నమోదు చేయలేదని ఎస్ఐ శ్రీనివాసులు ఆధారాలు సమర్పించారు. సుమోటోగా కేసు స్వీకరించాలి కదా అని ఎస్టీ కమిషన్ చైర్మన్ ప్రశ్నించారు. ఒక ట్రైబల్ విద్యార్థిని మృతి చెందితే ఏమి జరిగిందో తేల్చాల్సిన అధికారులు కప్పిపెట్టాలని చూశారని మండిపడ్డారు. సుమారు.3 లక్షలు నగదు విద్యార్థిని తల్లిదండ్రులకు ఇచ్చి కేసును తప్పుదోవ పట్టించాలని ఎలా చూస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అణగారిన వర్గాలు, నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని, ఈ క్రమంలో కొందరి నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. బంగారు భవిష్యత్ ఉన్న మహిత మృతి చెందడం దురదృష్టకరమన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌కు సిఫారసు చేశారు. విద్యార్థిని అనారోగ్యానికి గురైనా రిజిష్టరులో పేరు కూడా నమోదు చేయలేదని సబ్ కలెక్టర్ కార్తీక్ ఎస్టీ కమిషన్ చైర్మెన్ దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటినీ చూస్తుంటే స్పష్టంగా నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు.

మిగతా సిబ్బందిపై చర్యలు తీసుకోండి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులైన 9 మందిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి , వారిని సస్పెండ్ చేయాలని సబ్ కలెక్టర్ కార్తీక్‌కు ఎస్టీ కమిషన్ చైర్మన్ సిఫారసు చేశారు. పాఠశాలలో సిబ్బందిని మొత్తం బదిలీ చేసి నూతన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. అదే విధంగా విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.8 లక్షలు నష్ట పరిహారంతో పాటు 2 ఎకరాల పొలం, ఇంటి స్థలం, ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాల సిబ్బంది, బీసీ వెల్ఫేర్ అధికారి, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్, బీసీ వెల్ఫేర్ జోనల్ అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఐ వేణుగోపాల్, ఎస్ఐ శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మెన్ శ్రీనివాసులు, మాజీ చైర్మెన్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చిలమత్తూరు: మహిత మృతిపై తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు చిలమత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ప్రిన్సిపాల్ కరుణజ్యోతి, స్టాఫ్‌నర్స్ పద్మావతి, హౌస్ టీచర్ కోమల పీఈటీలపై 304ఏ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన కుమార్తె మహిత మృతి చెందినట్లు రమాదేవి ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

హైవేలకు వేగంగా భూసేకరణ

- కలెక్టర్ బసంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఏర్పాటు కాబోతున్న జాతీయ రహదారుల నిర్మాణానికి శరవేగంగా భూసేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి అమరావతి నుంచి రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, స్పందన గ్రీవెన్స్, వ్యవసాయ అనుబంధ శాఖలు, పంచాయతీ రాజ్ తదితర శాఖలపై వర్చువల్ ద్వారా సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్‌తో పాటు జేసీ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్ వివిధ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముదిగుబ్బ–పుట్టపర్తి–కోడూరు, బత్తలపల్లి – ముదిగుబ్బ, బీ.కొత్తపల్లి – గోరంట్ల – హిందూపురం, బెంగళూరు – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే తదితర జాతీయ రహదారులకు సంబంధించి వేగంగా భూ సేకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు.

రైతులందరికీ పరిహారం

నల్లమాడ: భూ సేకరణ చట్టం – 2013 మేరకు రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ భాగ్యరేఖ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ముద్దనూరు నుంచి కదిరి మీదుగా హిందూపురం వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండల పరిధిలో భూములు కోల్పోతున్న పులగంపల్లి, దొన్నికోట గ్రామాల రైతులతో గురువారం ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి రమేష్

కొత్తచెరువు: చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట వేసినట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ నేస్తం పథకం ద్వారా జిల్లాలో 2022–23కుగాను 14,169 మంది చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి మగ్గాల ఆధునీకరణకు సంవత్సరానికి రూ.24 వేలు చొప్పున అందించినట్లు పేర్కొన్నారు. అలాగే 890 మంది చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు, వైఎస్ఆర్ పింఛన్ కానుక పథకం కింద 50 సంవత్సరాలు వయస్సు దాటిన 15,800 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.2,750 పింఛన్ అందిస్తున్నామన్నారు. 2020 సంవత్సరం నుంచి ఇప్పటిదాకా 23 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. వీరిలో 6 మందికి పరిహారం అందించామని, మిగిలిన నలుగురికి ప్రతిపాదనలు విచారణ దశలో ఉన్నాయని, 13 మందికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వం చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేసి ఆదుకుంటోందన్నారు. ముడిసరుకుల ధరలను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్ఎంఎస్ఎస్ పథకం ద్వారా 15 శాతం యార్న్ సబ్సిడీ అందిస్తోందని పేర్కొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో కలెక్టర్ బసంత్‌కుమార్

పెనుకొండ రూరల్: గ్రామీణస్థాయి పేద ప్రజలకు ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించడమే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లక్ష్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం పెనుకొండ మండలంలోని వెంకటగిరిపాళ్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రతను కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. మూడు సంవత్సరాల పరిశోధన తర్వాత ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు. కేవలం డబ్బున్న వారికి మాత్రమే ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉండేవారని, అలాంటిది జగనన్న ఆధ్వర్యంలో ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను చేరువ చేశారన్నారు. ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా తొలిదశలోనే గుర్తిస్తే వ్యాధులను నిర్మూలించవచ్చన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా 64 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ దాదాపుగా 300 పైబడి సేవలను ప్రభుత్వం గ్రామీణ స్థాయిలోనే అందిస్తోందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా వైద్యాధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ శ్రావణి, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ రామాంజినప్ప, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ నిర్మల, నాయకులు ఆదినారాయణ, పురుషోత్తం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించగలరా?

- నిజం కాదని తేలితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా?
- నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కేతిరెడ్డి సవాల్
- తప్పుడు ఆరోపణచేస్తే సహించేదిలేదని వార్నింగ్



నారా లోకేష్ చేసిన ఆరోపణలు నిరాధారమంటూ ఆధారాలతో వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: తప్పుడు ఆరోపణలతో వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేవిధంగా ఆరోపణలు చేసి బురదజల్లాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి టీడీపీ నేతలు నారా లోకేష్, పరిటాల శ్రీరామ్‌లను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఇటీవల ధర్మవరం మండలంలో తాను కొనుగోలు చేసిన ఫాంహౌస్‌కు సంబంధించి చెరువు స్థలాన్ని కబ్జా చేశానని, పక్క వారి భూముని కూడా గూగుల్ మ్యాప్‌లో చిత్రీకరించి నారా లోకేష్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. వాస్తవంగా ధర్మవరం పొలంలో సర్వే నంబర్ 904, 905, 908, 909లలో కేవలం 25.38 ఎకరాలను కొనుగోలు చేసి అందులో మాత్రమే ఫాంహౌస్ నిర్మించి వ్యవసాయం చేస్తున్నామన్నారు. ఈ పొలాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే నారా లోకేష్ మాత్రం తన ఫాంహౌస్‌కు ఆనుకుని సర్వే నంబర్ 43లో ఉన్న జే. సూర్యనారాయణ అనే రైతుకు చెందిన పొలాన్ని తనదిగా చూపుతూ గూగుల్ మ్యాప్‌లో చిత్రీకరించి 20 ఎకరాలు కబ్జా చేశానని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. నారా లోకేష్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం వల్ల మరింత విలువలు దిగజారి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ఏ విచారణకైనా తాను సిద్ధమని, ఒకవేళ తాను చెప్పింది నిజమని తేలితే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. ఒక వేల అబద్ధమని తేలితే తాను ఎమ్మెల్యే పదవికి తక్షణం రాజీనామా చేస్తానని, సవాల్‌ను స్వీకరించే దమ్ముందా? అని ప్రశ్నించారు.

ఆధారాలతో సహా మీడియాకు...

ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి అనుచరులు 20 ఎకరాల భూమిలో ప్లాట్లు వేసి రూ.60 కోట్లు కాజేశారని నారా లోకేష్ తాజాగా ఆరోపించారన్నారు. ఇది కూడా పూర్తిగా అవాస్తవమన్నారు. 2009లో తామే ఈ పొలంలో పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేశామని తెలిపారు. ఆ తర్వాత 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆ స్థలంలో పట్టాలను పంపిణీ చేసి ప్లాట్లను కాజేశారన్నారు. ఈ పొలం కూడా కోర్టు పరిధిలో ఉందన్నారు. అలానే దొరిగిల్లు రోడ్డులో సర్వే నంబర్ 1330–1లో గుట్టలు చదును చేసి 17 ఎకరాలను ఆక్రమించారని ఆరోపించారన్నారు. వాస్తవంగా అయితే తామే ఈ పొలం అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ భూమి అని తెలియజేసే బోర్డును ఏర్పాటు చేయించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మీడియాకు ఎమ్మెల్యే చూపించారు. అంతేకాక సదరు స్థలంలో కొంత భాగంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలానే దొరిగిల్లు రోడ్డులో సర్వే నంబర్ 2060–4 మూడెకరాల స్థలాన్ని గత టీడీపీ ప్రభుత్వం ఖబరస్థాన్‌ను ఏర్పాటు చేస్తే దాని ఆక్రమించారని చెప్పారని ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. వాస్తవంగా అయితే 2022లో 2–90 ఎకరాల స్థలాన్ని ఖబరస్తాన్‌కు స్థలాన్ని కేటాయించింది తామేనన్నారు. ఇందుకు సంబంధించి ఈ స్థలం పూర్తి రక్షణలో ఉందన్నారు. దీనికి సంబంధించి ఆర్డీఓ ఇచ్చిన ఆర్డర్ కాపీని ఎమ్మెల్యే మీడియాకు చూపించారు.

పరువు నష్టం దావా వేస్తా

ప్రతి ఒక్క ఆరోపణకు తాను ఆధారాలతో సహా వివరణ ఇస్తున్నానని, తాను ఒక్కటే చెబుతున్నానని తన అనుచరులు ఎవరైనా సరే చిన్న పాటి తప్పు చేసిన ఉపేక్షించేది లేదన్నారు. అయితే ఏ ఆధారం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసే మీలాంటి వారిని ప్రజలు క్షమించరన్నారు. పాదయాత్రలో ప్రజలకు మీరు ఏం మంచి చేస్తారో చెప్పాల్సింది పోయి ఇలా బురద జల్లుడు రాజకీయాలు చేస్తూ పోతే మనుగడ ఉండదని హెచ్చరించారు. నిరాధార ఆరోపణలు చేసిన నారా లోకేష్, పరిటాల శ్రీరామ్‌లతో సహా యల్లో మీడియాపై పరువు నష్టం దావా వేస్తానని ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పష్టం చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి శిక్షణకు ఆపదమిత్రల ఎంపిక

అనంతపురం సిటీ: ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకూ శ్రీకాళహస్తిలో జరిగే ఆపదమిత్రల రాష్ట్ర స్థాయి శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎనిమిది మంది ఎంపికయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి గురువారం వెల్లడించారు. ఎంపికైన వారిలో పుట్లూరుకు చెందిన భీకన్నగారి శిరీష, రామతులసి, నాగ చౌడేశ్వర బాబు, గుడిబండకు చెందిన ప్రదీప్, పీసీ నరేష్, రొళ్లకు చెందిన నాగేంద్ర, అనిల్‌కుమార్, మంజునాథ ఉన్నారు.

డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగలింగారెడ్డి

పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్జేడీ నాగలింగారెడ్డి గురువారం తనిఖీ చేసారు. అధ్యాపకుల పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై మౌలిక సదుపాయాలు, విద్యాబోధనపై ఆరా తీశారు.

వ్యక్తి బలవన్మరణం

పెనుకొండ రూరల్: వ్యసనాలు వీడలేక జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం మేకలపల్లి నివాసి కురుబ కరియప్ప (42)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. జూదానికి బానిసైన కరియప్ప జులాయిగా మారాడు. ఈ క్రమంలో వ్యసనాలు వీడలేక జీవితంపై విరక్తితో గురువారం మధ్యాహ్నం పావగడ మార్గంలోని రైల్వే బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వైభవంగా రథోత్సవం


మడుగు తేరును లాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

తాడిమర్రి: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. 70 ఏళ్ల తాడిమర్రి ప్రజల కళ నెరవేరుస్తూ రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రథాన్ని డీసీఎంహెచ్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ తాడిమర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అర్చకులు మామిళ్లపల్లి జయరామయ్య, సంతోషశర్మ నేతృత్వంలో విశేష హోమాలు, అర్చనలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వరకూ మడుగు తేరును ఎమ్మెల్యే స్వయంగా లాగారు. సాయంత్రం ప్రధాన రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, తాడిమర్రి రమణారెడ్డి, మారక శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్యోతుల ఉత్సవాలు

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రొళ్ల మండల వ్యాప్తంగా గ్రామాల్లో అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని వైభంగా నిర్వహించారు. టీడీ పల్లి, హనుమంతనపల్లి, వన్నారనపల్లి, హులికుంట, దొమ్మరహట్టి, కొడగార్లగుట్ట, కొత్తపాళ్యంతండా, రొళ్ల కొండ, అలుపనపల్లి, ఎ.వద్రహట్టి, దాసప్పపాళ్యం, జీఎన్ పాళ్యం, బాజయ్యపాళ్యం, పి.గొల్లహట్టి, గొట్టుగుర్కి తదితర గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతులను ఊరేగింపుగా మోసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పూజలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. రత్నగిరి రాజవంశీకులు కుటుంబ సమేతంగా అమ్మవారికి జ్యోతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.


విశేష అలంకరణలో దర్శనమిస్తున్న రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి మూలవిరాట్


టీడీ పల్లిలో జ్యోతులను మోసుకొస్తున్న మహిళలు


రత్నగిరిలో జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న రాజవంశీకులు

రూ.2వేల కోట్ల లావాదేవీలే లక్ష్యం

- బ్రాంచి మేనేజర్ల సమీక్షలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2023–24 ఆర్థిక సంతవ్సరం ముగిసేలోపు బ్యాంకు టర్నోవర్ రూ.2 వేల కోట్లను అధిగమించేలా వ్యాపార ప్రణాళికలు అమలు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) మేనేజర్లను ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. నూతన వ్యాపార ప్రణాళిక అమలుపై డీసీసీబీ హాల్‌లో సీఈఓ ఏబీ రామ్ ప్రసాద్ అధ్యక్షతన బ్రాంచ్ మేనేజర్లతో గురువారం ఉదయం ఆమె సమీక్షించారు. మార్చి 31తో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ వ్యాపార లావాదేవీలు రూ.1,629 కోట్లకు చేరుకుందని, ఓవరాల్‌గా రూ.2.53 కోట్ల నికరలాభం వచ్చినట్లుగా వివరించారు. బ్యాంకులో డిపాజిట్లు రూ.525 కోట్లు ఉండగా... నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 6 శాతంతో రూ.66 కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌పీఏను తగ్గించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2వేల కోట్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే మిగతా వర్గాలకు పెద్ద ఎత్తున రుణాలు, బ్యాంకింగ్ సేవలు అందించాలన్నారు. 2022–23లో అత్యుత్తమ సేవలు అందించిన తాడిపత్రి, కొత్తచెరువు, అనంతపురం బ్రాంచి మేనేజర్లు, అలాగే ప్రతిభ కనబరిచిన బ్యాంకు సిబ్బందిని సత్కరించారు. సమావేశంలో జీఎం కె.సురేఖా రాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్, ఓఎస్‌డీ దినేష్‌కుమార్, ఆప్కాబ్ సలహాదారులు సుదర్శన్‌రావు, వెంకటేశ్వరరావు, నాబార్డు డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి


మృతుడు అశ్వత్థప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుటుంబసభ్యురాలికి చికిత్స చేయించేందుకు వచ్చిన ఓ వ్యక్తి కార్పొరేట్ ఆస్పత్రిలోని లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ఓడీసీ మండలం శేషయ్యగారిపల్లికి చెందిన గిద్దలూరు అశ్వత్థప్ప (70), లక్ష్మీదేవమ్మ అక్కాతమ్ముడు. భర్త లేకపోవడంతో తన సోదరుడి వద్దనే ఆమె ఉంటోంది. అశ్వత్థప్ప సైతం కుటుంబసభ్యులు దూరంగా ఉండడంతో అక్కకు తోడుగా ఉంటూ వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఆయాసంతో బాధపడుతున్న అక్కకు చికిత్స చేయించేందుకు బుధవారం అనంతపురానికి పిలుచుకుని వచ్చి చంద్ర హాస్పిటల్‌లో చేర్పించాడు. గురువారం ఉదయం 8.30 గంటలకు తనకు తోడుగా వచ్చిన గంగులప్పను వెంట బెట్టుకుని టిఫిన్ చేసేందుకు ఆస్పత్రిలోని నాల్గో అంతస్తు నుంచి లిఫ్ట్ ద్వారా కిందకు వచ్చేందుకు అశ్వత్థప్ప సిద్ధమయ్యాడు. ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్ కోసం బటన్ నొక్కి కాసేపు వేచి ఉన్నాడు. అనంతరం లిఫ్ట్ తలుపు తీసి లోపలకు కాలు పెట్టగానే కిందకు పడిపోయాడు. సాంకేతిక లోపం కారణంగా లిఫ్ట్ ఫస్ట్ ఫ్లోర్‌లోనే ఉండిపోయింది. తలుపు మాత్రమే తెరుచుకుంది. నాల్గో అంతస్తు నుంచి కిందకు పడడంతో అశ్వత్థప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. గంగులప్ప గట్టిగా కేకలు వేయడంతో అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది లిఫ్ట్ నుంచి అశ్వత్థప్ప మృతదేహాన్ని వెలికి తీశారు. ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. సమాచారం అందుకున్న మూడో పట్టణ సీఐ కత్తి శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అమడగూరు: మండలంలోని బి.కొత్తపల్లికి చెందిన భాస్కరరెడ్డి(45) గురువారం మారుతీపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపు తప్పి కిందపడడంతో భాస్కరరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక రీచ్ వద్ద ఆందోళన

పరిగి: స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి, ఇప్పటికైనా ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని, లేదంటే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. పరిగిలోని జయమంగళి నదిలో జేపీ సాండ్ కంపెనీకి ఇచ్చిన ఇసుక తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా ఆదేశాలతో ఇసుక రీచ్ వద్ద ముగ్గురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, వందమంది కానిస్టేబుళ్లు, 15 మంది స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు మోహరించారు. రీచ్ వద్ద తవ్వకాలు అడ్డుకునేందుకు వెళ్లిన పలువురిని అదుపులోకి తీసుకుని హిందూపురం రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత ప్రభాకర్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, మాజీ కన్వీనర్ జయరామ్, సర్పంచ్‌లు మంజునాథరెడ్డి, శివశంకర్, బాలు, లక్ష్మణ్ణ, ఎంపీటీసీ సభ్యులు మారుతీరెడ్డి, చంద్రారెడ్డి, చిక్కన్న, రామాంజి, నాయకులు ఆల్తాఫ్, సురేష్‌రెడ్డి, ఆదినారాయణ, ఎర్రప్ప, చిరంజీవి, రాజు, గిరి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.


ఇసుక రీచ్ వద్ద మోహరించిన పోలీసు బలగాలు

ఉపాధి పనులపై విచారణ

రొద్దం: మండలంలోని నల్లూరులో 2019–20లో జరిగిన ఉపాధి అక్రమాలపై గురువారం విజిలెన్స్ అధికారి రమణారెడ్డి విచారణ చేపట్టారు. తాడంగినల్లిలో సోపిట్లు పనులు పూర్తి చేశారు. అయితే ఆ పనులు నల్లూరు కూలీలతో చేయించినట్లు అప్పటి టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్ నమోదు చేయడంతో వివాదస్పదమైంది. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో ఏపీఓ జగదీష్ అక్రమాలకు ఊతమిస్తూ రూ.8 లక్షల బిల్లులు డ్రా చేశాడని ఆరోణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనలపై విజిలెన్స్ అధికారి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఏపీడీ జయసింహ, మడకశిర ఏపీఓ నాగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీఓ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన పవన్

బత్తలపల్లి: సాటి వ్యాపారి బెదిరింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో చెన్నప్ప కుమారుడు చాకలి పవన్ (28) చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం పవన్‌తో అదే గ్రామానికి చెందిన మరో చికెన్ సెంటర్ నిర్వాహకుడు బోయ రామాంజనేయులు గొడవపడ్డాడు. ఆ సమయంలో తాను చెప్పినట్లు వినకపోతే భార్యాపిల్లలను చంపుతానని పవన్‌ను బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన పవన్ ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక పవన్ మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారి ఎదుట రాశిగా పోసిన జొన్నకూడు

అమడగూరు: మండలంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం మొదటిరోజు కుంభకూడు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. రాత్రి ముత్యాల జొన్నలతో వండిన కూడును ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ఎదురుగా పెద్దెత్తున కుంభం వలె రాశిగా పోసి పూల కుచ్చును ఏర్పాటు చేశారు. జంతువులను బలిగా ఇచ్చారు. పూజలు ముగిసిన తర్వాత రక్తంతో తడిసిన జొన్నల కూడును, పూలకుచ్చును తీసుకెళ్లడానికి భక్తులు ఎగబడ్డారు. కూడును తీసుకెళ్లి నివాస గృహాలు, పంటపొలాలు, పశువుల పైన జల్లితే కీడు వాటిల్లదని భక్తుల నమ్మకం. ఉత్సవాల సందర్భంగా అమడగూరు, ఓడీ చెరువు ఎస్‌ఐలు వెంకటనారాయణ, గోపి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి ఆలయం రంగులు, విద్యుత్ అలంకరణలతో భక్తులను, చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయండి

కళ్యాణదుర్గం: కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆమె క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు పేరుతో ప్రతిష్టాత్మకంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాం. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ప్రతి గడపనూ గృహ సారథులు, గ్రామ/వార్డు సచివాలయం కన్వీనర్లు సందర్శించి సర్వే చేయనున్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను పోల్చి చెప్పే కరపత్రాలను అందిస్తారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని నమోదు చేస్తారు. మద్దతు తెలిపిన వారికి డోర్, మొబైల్ స్టిక్కర్లు ఇవ్వబడుతాయి. 82960 82960 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరుతారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతి కుటుంబం తలుపు తట్టాలి. ఇందుకు ఆయా నియోజకవర్గాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల డైరెక్టర్లు, ప్రతినిధులు, యువజన సంఘాలు సమన్వయంతో పనిచేయాలి. జగనన్నే మా భవిష్యత్తును ఒక యజ్ఞంలా విజయవంతం చేయాలి' అని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

లారీని ఢీకొని వ్యక్తి మృతి

ఓడీ చెరువు: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం గోళ్లవారిపల్లికి చెందిన మాయకుంట్ల ఆంజనేయులు (46), మంజుల దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం రాత్రి గౌనిపల్లికి చెందిన బాబుతో కలసి ద్విచక్ర వాహనంపై గోరంట్లకు ఆంజనేయులు బయలుదేరాడు. మార్గమధ్యంలో పగడాలవారిపల్లి సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని చీకట్లో గుర్తించలేక వేగంగా వెళ్లి వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఆంజనేయులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన బాబును స్థానికులు కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థికి గాయాలు

గుత్తి: ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడిన ఓ విద్యార్థి తలకు తీవ్ర గాయమైంది. వివరాలు.. గుత్తికి చెందిన కళ్యాణ్‌కుమార్ గురువారం ఉదయం పదో తరగతి పరీక్ష రాసేందుకు గుత్తి ఆర్ఎస్‌లోని కేంద్రానికి వెళ్లాడు. పరీక్ష ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంపై వెళుతూ వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు.

అర్హులకే త్రిచక్ర వాహనాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు త్రిచక్ర మోటారు వాహనాలు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 60 వాహనాలను మంజూరు చేయగా.. నియోజకవర్గానికి పది చొప్పున అధికారులు కేటాయించారు. వీటికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 234 మంది దరఖాస్తు చేసుకోగా.. అర్హుల ఎంపిక ప్రక్రియను గురువారం కలెక్టరేట్‌లో చేపట్టారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హులను గుర్తించిన అనంతరం వాహనాలను అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ రసూల్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సోషల్ వెల్ఫేర్‌శాఖ అధికారి శివరంగప్రసాద్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఆర్థోపెడిక్ వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శివశంకర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

పాదయాత్రలో భగ్గుమన్న విభేదాలు

శింగనమల/గార్లదిన్నె: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సాక్షిగా శింగనమల నియోజకవర్గంలో టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. గురువారం గార్లదిన్నెలో బహిరంగ సభ వద్ద ఫ్లెక్సీల ఏర్పాటు అంశంలో ద్విసభ్య కమిటీ, బండారు శ్రావణి వర్గీయులు ఘర్షణ పడ్డారు. బండారు శ్రావణి ఫ్లెక్సీలు వేయనివ్వకుండా ద్విసభ్య కమిటీ సభ్యులు, అనుచరులు అడ్డుకున్నారు. ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గం కావడంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన బండారు శ్రావణిని పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించింది. అయితే ఎస్సీ మహిళ కింద పనిచేయడం ఇష్టంలేని అగ్రవర్ణాలకు చెందిన ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి... గ్రూపు రాజకీయాలకు తెరదీయడంతో అధిష్టానం ద్విసభ్య కమిటీని నియమించింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో వర్గవిభేదాలు మరింత తారాస్థాయికి చేరుకున్నాయి. ఇదే అదనుగా ఓ వర్గం నాయకులు ఎంఎస్ రాజును లాబీయింగ్ చేశారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు నియమితులైన తర్వాత ప్రతి మండలంలోనూ గ్రూపులుగా టీడీపీ కార్యకర్తలు విడిపోయారు. ఇదే ధోరణి లోకేష్ పాదయాత్రలోనూ వ్యక్తమైంది.

బీజేపీ నిరంకుశ పాలనపై ప్రచార జాతా

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఊరూరా ప్రచార యాత్రలు, సభలు నిర్వహించాలని సీపీఐ, సీపీఎం నిర్ణయించాయి. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ వెల్లడించారు.